# నాకు నచ్చిన నా కథ

పదేళ్ళ కిందటి మాట. అప్పటికి రాజమండ్రి రైలురోడ్డు వంతెన పూర్తవలేదు. లాంచీలో గోదావరిదాటుతున్నప్పుడల్లా అక్కడ పాటలు పాడ్తూ కనుపించే గుడ్డివాడిమీద కథ రాయాలనిపించేది. అతని చుట్టూ ఓ కథ అల్లి వరకట్న సమస్యపై సెటైరిక్‌గా దీన్ని రాసేను. ఇది 7-12-73 ఆంధ్రపత్రిక వీక్లీలో ప్రచురితమైంది.

ఇందులో కల్యాణమంటపం దగ్గర జరిగిన సంఘటనని పోలిన ఓ దృశ్యం ఈ మధ్య ఓ సినిమాలో కనిపించింది. అది కాకతాళీయం కావచ్చు.



వి. సంపత్కుమారాచార్య

పాఠకుల ప్రశంస లందుకున్న ఈ నా కథ నాకూ నచ్చింది.

## భిక్షపతి

నేను సామాన్యంగా పెళ్ళిళ్ళకి వెళ్ళను. అంటే వెళ్ళకూడదని నియమమేమీ లేదు. పెళ్ళిళ్ళకి వెళ్ళడం, అక్కడ సరదాగా కాలక్షేపం చెయ్యడం చాలా మందికి హాబీ. కానీ నాలాంటివాళ్ళు పెళ్ళిళ్ళలో అంత వుత్సాహంగా తిరగలేరు. వివాహాలలో చాలా ఉత్సాహంగా తిరుగుతూ, అందర్నీ పలకరిస్తూ, సారెచీరెల

విసవిసల మధ్య, గారెబూరెల ఘమ ఘమల మధ్య సరసాలతో సరదాచేస్తూ, అవసర మైతే నడుంబిగించి వడ్డనలలోకి, ఇంకా మాట్లాడితే వంటలలోకి ప్రవేశిస్తారు కొందరు. ఆ విద్య అందరికీ రాదు. అది ఒక పెద్ద ఆర్ట్.

స్నేహితుడు శంకరం వివాహానికి "బంధుమిత్ర సపరివారంగా" కాక పోయినా కుటుంబ సమేతంగానైనా వెళ్ళి "అర్పిత చందన తాంబూలాది సత్కార ములను" స్వీకరించకపోతే వాడికి కోపంవస్తుందని వాడిమాట తీసెయ్యలేక బయల్దేరాను.

నేను ఉద్యోగం చేసేది కొవ్వూరులో. అయితే మా శంకరం పెళ్ళి రాజమండ్రిలో. ఈ రెండు ఊళ్ళకీ మధ్య గోదావరిమాత్రమే అడ్డు. ఇరవై పైసల ఖర్చుతో ఆ మహానదిని పావుగంటలో అవలీలగా దాటొచ్చు.

లాంచీ స్టాండుకి వెళ్ళగానే నా కళ్ళు అప్రయత్నంగా అటూ ఇటూ వెతికాయి. మా ఆవిడ "మీ మిత్రరత్నం కనబడలేదేమిటి?" అని జోక్ చేసింది.

నా మిత్రరత్నం అంటే ఎవరో కాదు. నే నెప్పుడు రాజమండ్రి వెళ్ళినా నాకు లాంచీదగ్గిర దర్శనమిచ్చే ఒక గుడ్డి బిచ్చగాడు. పేరు భిక్షపతి. వాడిని చూడందే నా మనసాగదు. నా కంఠం విన్న మరుక్షణం వాడు అడుక్కోడం మానేసి నా కాళ్ళదగ్గర కూర్చుని కమ్మని కంఠంతో పాట పాడ్తాడు. నేను వాడిని కుశలప్రశ్నలు వేసి ఏదో యిస్తుంటాను.

ఆ రోజు వాడు నాకు కనపడలేదు!

లాంచీ బయల్దేరే సమయానికి భిక్షపతిని చెయ్యిపట్టుకుని నడిపిస్తూ ఒక ముసల్ది వచ్చింది.

నా పలకరింపు విని వాడు పరమానందపడ్డాడు.

"దండాలు బాబు!....తమరికోసం రెండుమూడు దినాల్నుండి యెంతగానో చూస్తున్న బాబయ్య. ఏ గొంతి యినబడినా తమరేమోనని సూసీవోణ్ణి. నా అదురుష్టం గాపోతే యింత మంచి దినాన మీరు నాకోసమన్నట్టు వస్తరా బాబూ?" అన్నాడు.

వాడి వేషం రోజులా కాకుండా కొత్తగా ఉంది. రోజూ అతుకులువేసి, నల్లగా మాసిన కాకీ నిక్కరొకటి ఉండేది వాడి శరీరంమీద. అవాళ వాడు నీలంపేంటు వేసేడు. రెండుమూడు అతుకులున్నా, ఉతికి ఇస్త్రీ చేసినట్టుంది. పైన, డర్లు వేసుకునే నల్లకోటు పాతదొకటి తొడుక్కున్నాడు. భుజంమీద చిన్న తువ్వా లొకటి. ఎప్పుడూ అదోలా ఉండే వాడిమొహం ఇవాళ పరిశుభ్రంగా ఉంది.

సంస్కారంలేక మర్రిఊడల్లా అటూయిటూ వేలాడుతూ పెరిగిన వాడి జుట్టు శుభ్రంగా దువ్వి ఉంది. గడ్డం సున్నగా గీసిఉంది. కనుబొమల మధ్య నయా పైసంత కుంకుంబొట్టు, కుడిబుగ్గన చుక్క పెట్టుకున్నాడు.

"ఏరా భిక్షపతీ! ఏంటి విశేషం? ఇవాళ పెళ్ళికొడుకులా తయారయ్యావు? నువ్వా.... నీ మేకప్పా... దొరగార్లా ఉన్నావు?" అన్నాను.

ఆ కాస్త పొగడ్తకే వాడు మురిసిపోయాడు.

"నిజమే బాబయ్యా.... యియ్యాల నాకూ ఓ కుంటిదానికీ మనువు కుదిరినాది. రేవు దిగినంక తఁవరే సూస్తరుగా దాన్ని...."

నేను ఆశ్చర్యంగా వింటున్నాను.

"దానితండ్రి అందర్లోకీ పెద్దోడు. అది వాడి సొంతకూతురు గాదయ్యా. బిట్రగుంట రైలు టేశనుకాడ సిన్నప్పుడు దొరికిన్దంట. ఏడుస్తాంటే, యీ కుంటిపిల్ల వుంటె అడుక్కోడానికి నాల్గుపైస లెక్కువొస్తయ్యని పెంచుకున్నడు.... మొన్న నన్నడిగిన్డు యీ పిల్లని పేస్కుంటావా అని.... నే సరేనన్న. ఆ పిల్ల దాని గొంతుకూడ మా బాగుంటదయ్యా. తఁవరు దాన్ని నన్ను దీవించి అచ్చింతలు జల్లాలి."

వాడి గుడ్డి లోతు కన్ను గుంటల్లో నాకు ఆనందపు విశ్వరూపం తోచింది.

వాడింకా చెప్పుకుపోతున్నాడు....

"ఆ ముసలోడికి ఒక పెద్ద వకీలుగోరు ఎప్పుడో యీ నల్లకోటిచ్చిన్రట. దాన్ని పేనంలా సూస్కుంటూ పిల్లదాని మనువులో పెల్లికొడుకిక్కియ్యాలని అపురూపంగ దాచిండట. అది మొన్న నా కిచ్చిండు. పెల్లికి అదేసుని నేను లాంచీ దిగుతుంటె సూడాలని వుబలాట పడ్తున్నారా యిద్దరూ. ఓ మారాజు యీ పంట్లా మిచ్చిండు. మంగలి యీరన్న నా గడ్డంగీసి తల మాలీస్ చేసిన్డు. యీరన్న పెళ్లాం బుగ్గన సుక్కెట్టి బొట్టెటి పెల్లి సేస్కోరా కొడకా అని పేఁవగా పంపింది. రేవుకాడ ఆంజినేయస్వామికి దణ్ణమెట్టుకున్న. తఁవ రగపడరేమోనని యెంత బాధపడినో ఆ బగవంతుడికే యెరుక."

వాడీ విషయాలన్నీ చెప్తూంటే నాతోపాటు లాంచీలో కూర్చున్న మరి కొంతమందికూడా ఆసక్తిగా వింటున్నారు.

మనిషిలో ఎన్ని అంతస్తులున్నా జీవితంలో ఆశలు అందరికీ సహజమే. వారివారి పరిధులనిబట్టి ఆ ఆశలని తీర్చుకోడానికి, ఆనందాన్ని చేరుకోడానికి ప్రయత్నిస్తూంటాడు. అయితే పరిధినిమించి పరిభ్రమిస్తే పతనం తప్పదు.

జీవితం ఎంత విచిత్రమైనది?

ఈ జీవితంలో వివాహం ఎంత సుందరమైనది!

నా పెళ్ళికి మా మామగారు టెర్లిన్ సూట్లు పెట్టినప్పుడు నేను ఎంత ఆనందపడ్డానో అంతకుమించిన ఆనందాన్ని—ఎన్నో యేళ్ళక్రిందటే అతుకులు వేసిన ఓ పాత నల్లకోటు తొడుక్కున్న భిక్షపతి మొహంలో చూసేను.

"కట్నం ఎంతో మరి"

నవ్వుతూ భిక్షపతిని అడిగాడు.

ఇలా నే నడగడానికి ఓ కారణం ఉంది.

నా పక్కన కూర్చుని ఆసక్తిగా వింటున్నవాళ్ళకి నా ప్రశ్న ఓ జోక్‌లా పనిచేస్తుంది.

భిక్షపతి ఇదేం పట్టించుకునేలా లేదు. నే నడిగినదానికి జవాబు చెప్పడమే తన ధర్మమన్నట్టు చెప్పుకుపోతున్నాడు!

"రాజమండ్రి దానవాయిపేటలో ఓ పది మంచి యిళ్ళున్నయ్యంట బాబయ్యా. అవి నా కిస్తానన్నాడు."

"పది యిళ్లా!! ..." ఆశ్చర్యపోయాను.

ఇంత సంపాదిస్తున్నాను. ఇప్పటికీ సొంత యిల్లు లేదు. అద్దెలివ్వలేక చస్తున్నాను. అ ముసలి ముష్టివాడు పది యిళ్ళెలా సంపాదించాడు!.... నా కర్థం కాలేదు.

"అ ముసలోడికీ....కుంటిదానికీ లేదనకుండా రోజూ అన్నం కూర పచ్చడి పెట్టే యిళ్ళు పదున్నయ్యంట బాబయ్యా. అ పదిళ్ళకాడికి పెళ్ళయినంక నన్ను తీస్కపోయి సూపిస్తడంట. అళ్ళు పెట్టిన అన్నం తిని మిగిలింది మరో నాలాంటోడికి - కమ్మితే బీడీలకి పైసలొస్తాయి. కానీ.... నే నదేం ఒద్దన్న. నా గొంతులో పాట వున్నన్నోళ్ళూ నా సంపాదనకి లోటుండదు గద బాబయ్యా. రాత్రి పడినంక ముగ్గుర మనుక్కుంటే కొన్ని పైస లొస్తాయి. అందుకని ఆ ముసిలోడిని నాతోనే వుండమన్న."

ఇప్పు డర్థమైంది నాకు. పదిళ్ళంటే ఏమిటో -

భిక్షపతి మొహంలో ఎంత తృప్తి!.... ఎంత ఆనందం!!....

వేలకివేలు కట్నాలుపోసి....లాంఛనాలు యిచ్చి.... పండగ బహుమతులు యిచ్చి...ఏది అడిగితే అది కొని తమ సరదాలను తీరుస్తూంటే అనేకమంది యువకులు .... ఈ ఇరవయ్యో శతాబ్దంలో ఎంతో నాగరకతని సాధించామనుకునే

నవసమాజపు జీవగర్రలైన నేటి యువతరం.... చదువూ సంస్కారం ఉండి కూడా....తపతో అనురాగాన్ని పంచుకుని, మమతలు పెంచుకోడానికి జీవిత భాగ స్వామినిగా ప్రవేశించే అబలలని పోషించడానికి కట్నంపేరుతో డబ్బుతీసుకునే వ్యాపార మనస్తత్వం కల నేటి విద్యార్థికుల్లో కొందరు ఈ భిక్షపతి కాలిగోటికి సరిపోగలరా ??....

లాంచీ రాజమండ్రి రేవు చేరింది. భిక్షపతికి తోడుగా వచ్చిన ముసల్ది వాడిని మెల్లెక్కించి రోడ్డుమీద చేర్చి వెళ్ళిపోయింది.

భిక్షపతికోసం ఆడపెళ్ళివారు ఎదురుచూస్తున్నారు. ఆడపెళ్ళివారంటే ఎవరో కాదు. ఆ ముసలాడూ....కుంటి కుర్రదీ....మరో ఇద్దరూనూ.

నేను లాంచీ దిగి, శ్రీమతితో రోడ్డుమీదికి వచ్చాను. లాంచీ రేవుకి మా స్నేహితుడి విడిది దగ్గరే. తిన్నగా విడిదికి వెళ్ళాం. మమ్మల్ని చూడగానే శంకరం ముఖం వికసించింది.

"అదీ....అల్లా మాట నిలబెట్టుకోవాలి....నాకు తెలుసురా నువ్వొస్తావని" అంటూ ఆనందపడ్డాడు.

ఎన్నాళ్ళకో కలుసుకున్న స్నేహబృందం కబుర్లలో వివాహసమయం సమీపించడంకూడా తెలియలేదు.

కార్లలో కళ్యాణమంటపానికి వెళ్లాం...అక్కడ చాలా హడావుడిగా ఉంది.

సూత్రధారణ సమయం దగ్గరపడ్తోంది....

ఎవరో వచ్చి అక్షతలు చేతికిచ్చి వెళ్లారు.

పెళ్ళిపందిట్లో జనం మధ్య గాలి ఆడక గాలికోసం వీధివైపు వచ్చాను. వీధిలో జనం అటూయిటూ హడావుడిగా వెళ్తున్నారు.

పెళ్ళిళ్ళ సంరంభం ఎక్కువగా ఉన్నట్లుంది. రెండుమూడు చోట్లనించి సినిమాపాటలు విన్పిస్తున్నాయి.

వీధిలో ఒక దృశ్యాన్ని చూసి అట్టే స్థాణువై నిలిచిపోయాను!!

నా కళ్లు మెరిసేయి!!....

నా కళ్ళు అటువైపు నడకసాగించాయి!.... కళ్యాణమంటపం బయట, రెండుగోడలు కలిసేచోట...ఒక మూల భిక్షపతీ....కుంటిదీ కూర్చునిఉన్నారు!!...

లౌడ్‌స్పీకర్‌లో "మాంగల్యం తంతునానేన" అంటూ పెళ్ళిమంత్రాలు వినిపిస్తున్నాయి....

మంగళధ్వనులు తారస్థాయికి చేరుకున్నాయి! .... బహుశః పందిట్లో నా స్నేహితుడు శంకరం మంగళసూత్రం కడ్తూ ఉంటాడు.

వీధిలో భిక్షపతి కుంటిదాని మెడలో పసుపుకొమ్ము కట్టినతాడు ముడి వేస్తున్నాడు....అదే ముహూర్తానికి!!....

నా చేతిలోని అక్షతలు ఆ దంపతుల శిరస్సులపై పడ్డాయి!....

నా కళ్ళల్లోంచి ఆనందబాష్పాలు కురిసేయి!....

ఆ బిచ్చగాళ్ళ కళ్ళలో ఆనందం వెల్లివిరిసింది!.... ముసలివాడు నాకు నమస్కరించాడు....

భిక్షపతీ.... కుంటి పెళ్ళికూతురూ నా కాళ్ళనంటి నమస్కరించారు....

నే నప్రయత్నంగా జేబులో చెయ్యిపెట్టి చేతికివచ్చిన నోట్లని వాళ్ళ చేతుల్లో పెట్టాను.

ఎన్నోవేలూ....లక్షలూ ఖర్చుపెట్టి చేసే పెళ్ళిళ్ళకన్న ఈ పవిత్రమైన వివాహదృశ్యం ఏమాత్రం తక్కువకాదు.

ఆ పురాణదంపతులు ఈ నవ వధూవరులని తప్పక దీవిస్తారు....

మేళతాళాల మధ్య .... ఒక పవిత్ర ముహూర్తంలో పెళ్ళిచేసుకోవాలన్న కోరికని భిక్షపతి యీ విధంగా తీర్చుకున్నాడు.

వాడి మనస్సెంత పవిత్రమో కాని నా చేతిలో అక్షతలు వాడికే ప్రాప్తమున్నాయి!!....వాడు కోరినదీ అదే!!....

"సూత్రధారణ సమయంలో ఎక్కడికెళ్లారు? మీ కోసం పందిరి అంతా గాలించాను" అన్న మా శ్రీమతికి సమాధానంగా,

"నువ్వేం బాధపడక్కర్లేదు....ఆ సమయంలో ఎక్కడుండాలో అక్కడే ఉన్నాను."

అన్నాను నవ్వుతూ.

